క్లుప్తంగా

విద్యార్థులకు డీఐజీ అభినందన


అబాకస్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు: అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనపరచిన రైమ్స్ అకాడమీ విద్యార్థులను కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అభినందించారు. ఈనెల 14, 15వ తేదీల్లో న్యూఢిల్లీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రపంచస్థాయి అబాకస్ మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో 30కి పైగా దేశాల నుంచి 6 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కర్నూలుకు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అందులో ఆరుగురు ఛాంపియన్స్, 8 మంది ఫస్ట్ రన్నర్స్, నలుగురు సెకండ్ రన్నర్స్, 12 మంది థర్డ్ రన్నర్స్, ఇద్దరు ఫోర్త్ రన్నర్స్‌గా నిలిచి ట్రోఫీలను అందుకున్నట్లు అకాడమీ డైరెక్టర్ రూపా తెలిపారు.

హామీలపై కూటమిని నిలదీద్దాం


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు


కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని రాయల్ ఫంక్షన్ హాలులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ చేశారు. జై జగనన్న అంటూ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో ఏవైనా ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించేందుకు పార్టీ పక్కా ప్రణాళికలు రూపొందించిందన్నారు. పార్టీ మరింత బలోపేతం దిశగా నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇచ్చి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. పదవులు రాని వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యకర్తలకు ఏవైనా ఇబ్బందులుంటే పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. జిల్లాలో నూతన కమిటీల నియామకం జరిగిందని, వారితో సమన్వయం చేసుకొని పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేలా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు వచ్చే జనవరి నుంచి వైఎస్ జగన్ అన్ని నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని, జగనన్నకు అండగా పనిచేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు గద్దం రామకృష్ణ, సిట్రా సత్యనారాయణమ్మ, సువర్ణరెడ్డి, శివకుమార్, జుబేర్, యూనూస్ బాషా, షేక్ అహమ్మద్, ఆర్షియా ఫర్హీన్, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించాలని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ సూచించారు. శుక్రవారం ఏక్యాంపులోని హార్ట్ ఫౌండేషన్‌లో సహిత విద్య, బడి బయటి పిల్లల విషయంలో క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన అంశాలపై ఎంఈఓ-1, ఎంఈఓ-2లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈఓతో పాటు, సహిత విద్య రాష్ట్ర సమన్వయకర్త కల్పన హాజరై ప్రసంగించారు. కుటుంబ సభ్యులకు భారం అయ్యామనే భావన దివ్యాంగుల్లో ఉంటుందని, వారితో మాట్లాడి మానసిక ధైర్యం నింపాలన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. వలస వెళ్లిన వారి పిల్లలను సీజనల్ హాస్టళ్లలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, ఐఆర్‌పీల సహకారంతో వైద్య సదుపాయాలు అందించాలని, భవిత కేంద్రాలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని సూచించారు. బడి బయటి పిల్లల స్టేట్ కో-ఆర్డినేటర్ గీత, సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ సురేష్‌రాజు, ఎంఈఓలు పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ


ఆహార పదార్థాలతో శ్రీహరి రూపం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో ధనురాస్మ పూజల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి తిరుప్పావడ సేవను వైభవంగా నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలతో శ్రీహరి రూపాన్ని తీర్చిదిద్ది నైవేద్యం సమర్పించారు. మహా అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి బృందం తిరుప్పావై పారాయణం చేశారు. శ్రీ విష్ణు సహస్రనామ సత్సంగం నిర్వాహకులు పుల్లారెడ్డి బృందం విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు.

ఆటోలో మర్చిపోయిన వస్తువుల అప్పగింత

కర్నూలు: ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన రూ.40 వేలు విలువ చేసే చీరలను సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించి పోలీసులు బాధితురాలికి అప్పగించారు. కర్నూలు రెవెన్యూ కాలనీకి చెందిన స్వాతి పాతబస్తీలోని మించిన్ బజార్‌లో రూ.40 వేలు విలువ చేసే చీరలను కొనుగోలు చేసి ఈనెల 18వ తేదీన ఆటోలో ఇంటికి చేరుకుంది. ఆటో దిగేటప్పుడు చీరలు మరిచిపోయింది. కొద్దిసేపు తర్వాత తేరుకుని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కానిస్టేబుళ్లు షేక్షావలి, ఆంజనేయులు సీసీ ఫుటేజీ ద్వారా శుక్రవారం ఆటోను గుర్తించి చీరలను బాధితురాలికి అప్పగించినట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

క్రీడా ప్రాంగణాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు చెందిన క్రీడా ప్రాంగణాలను లీజుదారులు శుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సూచించారు. శుక్రవారం 19వ వార్డు జొహరాపురంలో ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ రింక్‌లను అదనపు కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. లీజుదారులు సక్రమంగా నిర్వహించకపోయిన, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారి జునీద్, ఆర్ఐ భార్గవ్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుళ్లగా పనిచేస్తున్న అర్హులకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పించాలని కోరుతూ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ అసోసియేషన్ ప్రతినిధి బృందం డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయలసీమ జోన్‌లో 48 మంది, కర్నూలు జిల్లాలో ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి పొందేందుకు అర్హత ఉందన్నారు. జోనల్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరుతూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓబులేసు, మధుసూదన్‌రెడ్డి, జగన్నాథం, విరుపాక్షిరెడ్డి తదితరులు డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

రెండు వారాల్లో అర్జీలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను రెండు వారాల్లో పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజితబాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, పంచాయతీరాజ్ సీసీ రోడ్లు, పీఆర్ వన్ యాప్ తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన మ్యుటేషన్, పాసుబుక్ దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనకబడిన నందవరం, హొలహర్వి, ఆలూరు, వెల్దుర్తి, కోసిగి, ఆస్పరి, దేవనకొండ, పెద్దకడబూరు మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలకు మెమోలు ఇవ్వాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. అలాగే మంత్రాలయం డీఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. 6 నెలల నుంచి పురోగతి చూపని ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. పీఆర్ సీసీ రోడ్ల పనులను జనవరి 15లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆలూరు, హొళగుంద మండలాల్లో ట్యాంకుల క్లోరినేషన్ 13 శాతమే పూర్తికావడంతో ఈఓఆర్‌డీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న ఈఓఆర్‌డీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీఓను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని డిసెంబర్ 31 నాటికి తాగునీటికి సంబంధించి ప్రణాళికలను పంపాలని ఆదోని సబ్‌కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలను ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, పీఆర్ ఎస్ఈ రామచంద్రా రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాలను పునర్వినియోగించుకోవాలి


రీసైక్లింగ్ ప్రక్రియను తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నిర్మాణ రంగం నుంచి వెలువడే వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం 19వ వార్డు పరిధిలోని జొహరాపురం రహదారిలోని డంప్ యార్డులో సీఏడీడబ్ల్యూ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ వేస్టేజ్) రీసైక్లింగ్ ప్లాంటును కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న భవన నిర్మాణ వ్యర్థాలను కొత్త రూపంలో పునర్వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా సహజ వనరుల వినియోగం తగ్గి పర్యావరణానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

కర్నూలు (సిటీ): యువజన సర్వీసుల శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో స్థానిక మైపర్ కళాశాలలో.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలపై లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ (ఏపీఎస్పీ) మహబూబ్ బాషా, ఎక్సైజ్ సీఐ రాజేంద్రప్రసాద్, సీఐ విజయలక్ష్మి మాట్లాడుతూ.. యువత చెడు స్నేహాలు, మద్య పానం, దూమపానం తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా తిరగబడాలన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళలపై వేధింపులు, సైబర్ క్రైం నేరాలపై 181, 1098, 1930, 100 తదితర టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ఎండీ ఆదిమూలపు సతీష్, సెట్కూరు సీఈఓ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

22న ఉప్పర సంఘం సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 22న ఏలూరులో సగర, ఉప్పర సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సగర, ఉప్పర రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఉప్పరి సురేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయినా, ఉప్పర సామాజిక వర్గానికి రాజ్యాంగ పరమైన హక్కులు లభించలేదన్నారు. ఉప్పర, సగర సామాజిక వర్గాన్ని ఒకే తాటి మీదకు తెచ్చేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉప్పర, సగరులందరూ హాజరుకావాలని కోరారు.

వాహన పార్కింగ్‌కు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వాహనాల పార్కింగ్‌కు తగిన చర్యలు తీసుకోనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, ఫిమేల్ మెడికల్ వార్డు, చిన్నపిల్లల విభాగం, ఓల్డ్ క్యాన్సర్ బ్లాక్ వద్ద ఖాళీ స్థలంలో వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్సకు ఓపీ నంబర్ 222 విభాగాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీరాములు, సీతారామయ్య, వైద్యాధికారులు ఉన్నారు.

కర్నూలులో వక్ఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు జోనల్ కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీరా కోరారు. ఈ మేరకు ఏపీ ముతవల్లీస్, మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు షకీల్ షఫీ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన విజయవాడలో ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

మురుగు నిల్వలు లేకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): ఇంటి పరిసరాల్లో మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా చేయాలని, తద్వారా దోమలు పెరగకుండా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. శుక్రవారం మెరీడియట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏ.క్యాంపులో జరుగుతున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని ప్రాంతాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని, వారానికి ఒకసారి డ్రమ్ముల్లోని నీటిని పూర్తిగా తొలగించి శుభ్రం చేసేలా చూడాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మావతి తదితరులు ఉన్నారు.

జిల్లాకు సెమీ కండక్టర్ ప్రాజెక్టు

కర్నూలు (అర్బన్): క్రిస్మస్ కానుకగా జిల్లాకు సెమీ కండక్టర్ రంగంలో రూ.14 వేల కోట్లతో పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన హైటీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో పాటు మంత్రి టీజీ భరత్ హాజరయ్యా రు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టును రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. యేసుప్రభు జీవితం మానవాళికి సందేశమన్నారు. క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాండిల్ లైటింగ్ సర్వీసులో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్వో వెంకటనారాయణమ్మ, అధికారులు సావిత్రి, ముంతాజ్, థరూర్ జేమ్స్, లక్ష్మీనారాయణ, సబీహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు-1 బస్ డిపో తనిఖీ

కర్నూలు సిటీ: కర్నూలు-1 బస్ డిపోను డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు హరిబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో గ్యారేజీలోని బస్సుల పనితీరును పరిశీలించి మెకానిక్‌లతో మాట్లాడారు. బస్సుల సర్వీసుల పని తీరు, తలెత్తుతున్న సమస్యల గురించి డిపో మేనేజర్ సుధారాణి వివరించారు. హరిబాబు మాట్లాడుతూ.. బస్సుల కండిషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే పెను నష్టం జరుగుతుందన్నారు. మరమ్మతుల విషయంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంద్ర బస్సు పనితీరును రోడ్డు టెస్ట్ ద్వారా పరీక్షించారు.

సీపీఎం నేతలపై కేసు కొట్టివేత

కర్నూలు(సెంట్రల్): 2013లో అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో కొట్టాల కూల్చివేతను అడ్డుకున్న నేపథ్యంలో తమపై అప్పటి మంత్రి టీజీ వెంకటేష్ బనాయించిన తప్పుడు కేసును ఆదోని కోర్టు కొట్టివేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, పార్టీ నాయకుడు ఎస్ఎండీ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో తమపై నేరం రుజువు చేయడానికి 12 మంది సాక్షులను ప్రవేశపెట్టినా నేరం రుజువు కాలేదని, వేధింపులకు భయపడకుండా సీపీఎం తరఫున పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు.